గంజాయి విక్రయాలపై స్పెషల్ డ్రైవ్

- ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 24 గంటలూ నిఘా
- ఇప్పటికే పదిమంది జైలుకు..

ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి అమ్మకాలు, కొనుగోలుదారులపై పోలీసులు ఉక్కు పాదం మోపుతున్నారు. 13 అనుమానిత ప్రాంతాలపై 24 గంటలపాటు నిఘా పెట్టారు. జనవరి నుంచి ఇప్పటి వరకు గంజాయి తాగి బహిరంగ ప్రదేశాల్లో న్యూసెన్స్ గొడవలు చేసిన పదిమందిని జైలుకు పంపారు.



రాంనగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గంట గంటకూ పోలీస్ పెట్రోలింగ్‌తో పాటు సీసీ కెమెరాల ద్వారా 24 గంటలపాటు నిఘా పెట్టి గంజాయిరహిత పోలీస్‌స్టేషన్‌గా మార్చేందుకు ముషీరాబాద్ పోలీసులు సీఐ రాంబాబు పర్యవేక్షణలో గత నెలన్నరగా స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. గంజాయి విక్రయించే వారిపై కూడా ప్రత్యేక నిఘా పెట్టారు. గంజాయి తాగుతున్న యువతను పట్టుకొని తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. గంజాయికి అలవాటు పడి ఇంట్లో డబ్బుల కోసం న్యూసెన్స్ చేసే వారి తల్లిదండ్రులు స్వయంగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి వారిపై చర్యలు తీసుకోవాలని కోరడం గమనార్హం.


గంజాయి కొనుగోలుదారులు (ఫైల్)

అనుమానిత ప్రాంతాల గుర్తింపు..

గంజాయి విక్రయించే 13 ప్రాంతాలను పోలీసులు గుర్తించారు. రిసాల కుర్షిద్ జాయిద్‌లోని వాటర్‌వర్క్స్ కార్యాలయం వద్ద, రంగానగర్ కమ్యూనిటీహాల్ ఎదురుగా గల పాత భవనం, పద్మశాలికాలనీలోని హనుమాన్ ఆలయం సమీపంలోనూ, బాకారం పోచమ్మ గుడి సమీపంలోనూ, ఇందిరానగర్‌లోని సెట్విన్ గ్రౌండ్ దగ్గర, హరినగర్‌లోని సమోసా గ్రౌండ్, జెమినికాలనీలోని పురాతన బిల్డింగ్, ముషీరాబాద్‌లోని కళాధర్‌నగర్‌లోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ గల్లీ తదితర ప్రాంతాలను గుర్తించారు. ఇక్కడ విక్రయాలు జరగకుండా పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

ధూల్‌పేట, ఫతేనగర్ నుంచి సరఫరా..

ధూల్‌పేట, ఫతేనగర్ ప్రాంతాలకు చెందిన పలువురు గంజాయి విక్రయదారులు సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి 12గంటలలోపు ఐదు, పది గ్రాముల ప్యాకెట్ల చొప్పున విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఐదు గ్రాముల ప్యాకెట్లను రూ.300కు పది గ్రాముల ప్యాకెట్లు రూ.500కు విక్రయిస్తున్నట్లు తమ విచారణలో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. పెట్రోలింగ్ ఏర్పాటు చేయడంతో పాటు మఫ్టీ పోలీసులను రంగంలోకి దించారు. చదువు మధ్యలో మానేసిన ఇంటర్, డిగ్రీ విద్యార్థులతోపాటు కార్మికులు ఎక్కువగా గంజాయికి బానిస అవుతున్నట్లు విచారణలో గుర్తించామని పోలీసులు తెలిపారు.

8712660150కు సమాచారం ఇవ్వండి



ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్కడైనా గంజాయి అమ్మకాలు జరిగితే 8712660150కు సమాచారం ఇవ్వాలి. గంజాయి విక్రయించే అనుమానిత ప్రాంతాల్లో పెట్రోలింగ్ పెంచాం. పిల్లల అలవాట్లపై తల్లిదండ్రులు కూడ దృష్టి పెట్టాలి. గంజాయికి బానిసైన యువతకు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పగిస్తున్నాం. తాగి న్యూసెన్స్ చేసే వారిని అరెస్టు చేసి జైలుకు పంపిస్తున్నాం. ఇప్పటికే 10 మందికి జైలు శిక్ష కూడా పడింది.

- రాంబాబు, సీఐ, ముషీరాబాద్


సంజీవయ్య విగ్రహం వద్ద నివాళులర్పించిన ప్రసాదరావు, హనుమంతరావు తదితరులు

మాజీ సీఎం సంజీవయ్య సేవలు చిరస్మరణీయం

- అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాదరావు

రాంనగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నాడు రాష్ట్రానికి మాజీ సీఎం దామోదరం సంజీవయ్య చేసిన సేవలు చిరస్మరణీయం అని అసెంబ్లీ స్పీకర్ జి.ప్రసాదరావు, మాజీ ఎంపీ వి.హనుమంతరావులు పేర్కొన్నారు. దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు శుక్రవారం సంజీవయ్య ట్రస్ట్ చైర్మన్ వీహెచ్ ఆధ్వర్యంలో జరిగాయి. ఈ కార్యక్రమంలో స్పీకర్ పాల్గొని సంజీవయ్య విగ్ర హానికి పూలమాలల వేసి నివాళులర్పించి ఆయన చేసిన దేశ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, రాష్ట్ర నాయకులు ఆర్.లక్ష్మణ్‌యాదవ్, బొల్లుకిషన్, యాదగిరిగౌడ్, ఆప్సర్, దిడ్డి రాంబాబు, పులి జగన్, రమేష్‌బాబు, రామ్మోహన్, శ్యామ్‌రావు, గడ్డం శ్రీధర్, కోటం అనిల్‌కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ప్రొఫెసర్ సింహాద్రి

విద్యార్థులు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి

రాంనగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని తెలంగాణ ఉన్నత విద్య కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ సింహాద్రి సూచించారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విద్యాసంస్థ ఎంటర్ ప్రిమియర్ షిప్ ఆధ్వర్యంలో ఫుడ్ కార్నీవాల్, ఆహార ఉత్సవ కార్యక్రమం జరిగింది. 40కి పైగా ఫుడ్ కోర్టులను ఏర్పాటు చేశారు. విద్యార్థులు ఫుడ్ కార్నీవాల్ నిర్వహించడం సంతోషంగా ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ విష్ణుప్రియ, అధ్యాపకులు పాల్గొన్నారు.

టీబీసీ జిల్లాల కార్యనిర్వాహక సభ్యుల నియామకం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బిషప్ కౌన్సిల్(టీబీసీ) జిల్లాల కార్యనిర్వాహక సభ్యుల నియామకం శుక్రవారం జరిగింది. చిక్కడపల్లిలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో టీబీసీ రాష్ట్ర కో-ఆర్డినేటర్, హోలీప్రిన్స్ గాస్పెల్ మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు డా.కొమ్ము ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ నూతన కమిటీ సభ్యులు దేవుడి చిత్తాన్ని నెరవేర్చేవారుగా పనిచేయాలన్నారు. ఈ సందర్భంగా బిషప్ ఎం.ప్రదీప్‌కుమార్ సహకారంతో తెలంగాణ బిషప్ కౌన్సిల్ వ్యవస్థాపకులు, అధ్యక్షులు బిషప్ డా.ఆర్.విక్రమ్‌పాల్, జాయింట్ సెక్రటరీ ఏసుపాదం సమక్షంలో హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, వికారాబాద్ జిల్లాల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు, కోశాధికారులు, జిల్లాల ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులను నియమించారు. వారికి నియామకపత్రాలు అందజేశారు.


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఐక్యవేదిక నేతలు

ఐటీడీఏలు ఏర్పాటు చేయాలి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు మైదాన ప్రాంతాల్లో ఉన్న ఆదివాసీ గిరిజనుల అభివృద్ధి కోసం ఐటీడీఏలు ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సం ఘాల ఐక్యవేదిక నేతలు కోరారు. ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ ఎల్.రూప్‌సింగ్, వైస్‌చైర్మన్ లోకిని రాజు నేతృత్వంలో వారు శుక్రవారం రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి వివరించారు. ఎస్టీ జాతి అభివృద్ధి కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని కోరగా, సానుకూలంగా స్పందించిన మంత్రి సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీఇచ్చారు. కార్యక్రమంలో ఐక్యవేదిక ప్రతినిధులు కుతాడి రవికుమార్, వనం రమేష్, గోవర్ధన్, నరసింహ, భిక్షపతి, నాగులు, రవి, నరేష్, రామకృష్ణ, రాములునాయక్, మోహన్‌నాయక్, ప్రకాష్, ముత్తయ్య, ప్రవీణ్ పాల్గొన్నారు.

'గ్రేటర్‌లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లను ఓడించడమే లక్ష్యం'

బర్కత్‌పుర, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్‌లను ఓడించడమే లక్ష్యం అని బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు లంకాల దీపక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బీజేపీ ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సి.వినోద్‌యాదవ్ ఆధ్వర్యంలో దీపక్‌రెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

బీజేపీ మహాకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడిగా గుండగోని భరత్‌గౌడ్

- నేడు పదవీ బాధ్యతల స్వీకారం


భరత్‌గౌడ్

రాంనగర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మహాకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడిగా ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన బీజేవైఎం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్ నేడు సాయంత్రం 4 గంటలకు ముషీరాబాద్‌లోని కశీష్ ఫంక్షన్‌హాల్‌లో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు చిక్కడపల్లిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందని తెలిపారు. శుక్రవారం బాగ్‌లింగంపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రమాణ స్వీకారానికి ముఖ్యఅతిథులుగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, కేంద్ర మంత్రి బండి సంజయ్, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, రాజ్యసభసభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ హాజరవుతారని తెలిపారు.


భరత్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఉడతల బాలకృష్ణగౌడ్, గౌడ సంఘం నేతలు

బూత్ స్థాయి నుంచి..

భరత్‌గౌడ్ 1999లో ముషీరాబాద్ నియోజకవర్గంలోని చిక్కడపల్లి బూత్ సభ్యుడిగా రాజకీయ జీవితాన్ని ప్రారంభించి అంచెలంచెలుగా ఎదిగారు. 2005లో క్రియాశీలక సభ్యత్వం పొందారు. 2007లో బీజేవైఎం ఉమ్మడి రాష్ట్ర కోశాధికారిగానూ, 2011లో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగానూ, 2015లో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగానూ, 2021లో మహబూబ్‌నగర్ జిల్లా ఇన్‌చార్జీగానూ పనిచేశారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఆయనపై పలు కేసులు నమోదయ్యాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అసెంబ్లీ, ప్రగతిభవన్ ముట్టడి నిర్వహించారు.

నూతన గౌడ సంఘం ఆధ్వర్యంలో సత్కారం

భరత్‌గౌడ్‌ను నూతన గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉడతల బాలకృష్ణగౌడ్ ఆధ్వర్యంలో శుక్రవారం సన్మానించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఎం.నవీన్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు రామ్మోహన్‌గౌడ్, వంగాల బాల్‌రాజ్‌గౌడ్, వీరయ్యగౌడ్, మధుగౌడ్, రవీందర్ గౌడ్ పాల్గొన్నారు.

బన్సీలాల్‌పేటలో గజ్జెల రుషికేశ్వర్ అంత్యక్రియలు


రుషికేశ్వర్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న జైసింహ, అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు

రాంనగర్, ఫిబ్రవరి 3 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ కార్యదర్శి గజ్జెల రుషికేశ్వర్ అంత్యక్రియలు శుక్రవారం బన్సీలాల్‌పేట శ్మశానవాటికలో జరిగాయి. అంత్యక్రియల్లో రాజ్యసభసభ్యులు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, బీఆర్‌ఎస్ యువజన నాయకుడు మురా జైసింహ, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు నల్లవెల్లి అంజిరెడ్డి, టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ అధ్యక్ష, కార్యదర్శులు పి.సాయిబాబా, కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అరవింద్‌కుమార్‌యాదవ్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు పెండెం శ్రీనివాస్‌యాదవ్, నాయకులు అభిషేక్‌కెనెడి, లోకేష్‌యాదవ్, రమేష్‌గౌడ్, వెంకటేష్, రాజుదీప్, గజ్జెల అభిషేక్, గజ్జెల సూర్యనారాయణ, బీఆర్‌ఎస్ నాయకులు శంకర్ ముదిరాజ్, వివేక్, కేశపురం అరుణ్, వివిధ పార్టీల నేతలు, దళిత సంఘాల నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు, కుటుంబ సభ్యులు పాల్గొని నివాళులర్పించారు.


మార్మిక నది పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నరసింహప్ప, విద్యాధర్‌రావు

సమాజానికి సందేశాన్నిచ్చే బిక్కి కృష్ణ రచనలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సమాజానికి సందేశాన్నిచ్చేవి బిక్కి కృష్ణ కవితా రచనలు అని ఆదాయ, పన్నుల శాఖ రిటైర్డ్ కమిషనర్ ఎం.నరసింహప్ప అన్నారు. విమల సాహితీ సమితి ఆధ్వర్యంలో ఆర్టీసీక్రాస్‌రోడ్‌లోని సిటీకల్చరల్ సెంటర్‌లో శుక్రవారం సాయంత్రం జరిగిన కార్యక్రమంలో బిక్కి కృష్ణ రచించిన మార్మిక నది సంపుటిని ఆవిష్కరించారు. మార్మిక నదితోపాటు కృష్ణ రచనలు వాప వెలిశాక, కాలం నది ఒడ్డున, ప్రకృతి-పర్యావరణం కావ్య సమీక్ష విమల సాహితీ సమితి అధ్యక్షుడు జెల్లి విద్యాధర్‌రావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రసిద్ధ కవి, విమర్శకులు డా.నాళేశ్వరం శంకరం, బీరం సుందరరావు, కోయి కోటేశ్వరరావు, శ్రీనివాస్‌గౌడ్, మంజుల సూర్య, రమాదేవి కులకర్ణి, రాధా కుసుమ, అరికపూడి రఘు, పద్మశ్రీలత తదితరులు పాల్గొన్నారు.

పురాతన విద్యుత్ మీటర్లను తొలగించాలి

- కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ


పురాతన విద్యుత్ మీటర్లను పరిశీలిస్తున్న రచనశ్రీ తదితరులు

కవాడిగూడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్‌లోని దేవి ప్రసాద్‌బాగ్, జ్యోతినగర్‌లలో విద్యుత్ స్తంభాలకు కొన్నేళ్ల కిందట ఏర్పాటు చేసిన పురాతన మీటర్లను తొలగించి నిత్యం షార్ట్‌సర్క్యూట్ బారి నుంచి ప్రజలను రక్షించాలని కార్పొరేటర్ జి.రచనశ్రీ ట్రాన్స్‌కో అధికారులను కోరారు. గురువారం రాత్రి పురాతన విద్యుత్ మీటర్ బాక్స్‌ల్లో షార్టుసర్క్యూట్ అయి మంటలు వచ్చాయని తెలుసుకున్న ఆమె ట్రాన్స్‌కో అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. సమస్యను పరిష్కరించేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు వెంకటేష్, డివిజన్ నాయకుడు శివరాజ్, బస్తీవాసులు పాల్గొన్నారు.


బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని రెడ్ బిల్డింగ్ చౌరస్తాలో భరత్‌నగర్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో పుల్వామా దాడిలో అసువులు బాసిన వీర జవాన్ల చిత్రపటాలకు బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఎస్.గౌతమ్‌రావు, సికింద్రాబాద్ పార్లమెంట్ సంయుక్త కన్వీనర్ ఏదెల్లి అజయ్‌కుమార్ నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సి.కృష్ణగౌడ్, ధనుంజయ, పి.గోవర్ధన్‌రెడ్డి, చుక్క జగన్, ఏదెల్లి భాస్కర్, యశ్వంత్, ప్రవీణ్‌కుమార్, సాయిరామ్, రఘుచారి, ముఖేష్‌గౌడ్, సాయిచరణ్, అనిల్‌కుమార్, హరీష్, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.
- నల్లకుంట, ఆంధ్రజ్యోతి

'భజరంగ్‌దళ్, వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్‌ను నిషేధించాలి'

నల్లకుంట, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రేమికుల దినోత్సవాన్ని వ్యతిరేకించిన బజరంగ్‌దళ్, వీహెచ్‌పీ, ఆర్‌ఎస్‌ఎస్‌లను నిషేధించాలని ఆలిండియా దళిత అండ్ క్రైస్తవ సంఘాల సమాఖ్య, క్రీస్తు ధర్మ ప్రచార అండ్ పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు జెరూసలేం మత్తయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రేమికులైన యువతీ, యువకుల భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, రాజ్యాంగ హక్కులకు వ్యతిరేకంగా వాలెంటైన్ డేను హిందూ సంఘాలు వ్యతిరేకించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు.

సమాజశాంతిలో బ్రహ్మకుమారీ సంస్థలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సమాజంలో శాంతి స్థాపనకు బ్రహ్మకుమారి సంస్థలు విశేషంగా కృషి చేస్తున్నాయని చిక్కడపల్లి బ్రహ్మకుమారి సంస్థ ఇన్‌చార్జి జయశ్రీ అన్నారు. చిక్కడపల్లి బ్రహ్మకుమారి సంస్థ కార్యాలయంలో శుక్రవారం నవజీవన అనాథాశ్రమంలో నివసించే పిల్లలకు నోట్‌పుస్తకాలు, పెన్నులు, తినుబండారాలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీదేవి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

ముషీరాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ బోలక్‌పూర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు రవికుమార్ అన్నారు. శుక్రవారం రంగానగర్‌లో జిప్స్ సంస్థ, వైపోరెడి, జననీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 150 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో జననీ ఫౌండేషన్ అధ్యక్షుడు మల్లేష్, నాయకులు వినోద్, అరవింద్, శ్రీనివాస్, నరేష్, వెంకటేష్, డాక్టర్లు కార్తీక్, సురేఖ, కరుణాకర్, రాహుల్ పాల్గొన్నారు.